సాక్షి
నల్లగొండ
శనివారం, 18, మార్చి, 2023





**భయాందోళనలో విద్యార్థులు**
చివ్వెంలలోని జీసీ బాలుర గురుకులంలో ఓ విద్యార్థి మృతి చెందడంతో తోటి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. - IIలో



**వ్యక్తికి 20 ఏళ్లు జైలు**
బాలికపై అత్యాచారం ఘటనలో కోర్టు నిందితుడికి 20 ఏళ్లు జైలు, రూ.2 వేల జరిమానా విధించింది. - IIలో

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం 35°/22°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ఈత కారాదు.. విషాదం : ఎస్పీ

నల్లగొండ క్రైం : ఈత సరదా విషాదం కావొద్దని ఎస్పీ అపూర్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో పిల్లలు ఈత కోసం కాల్వలు, చెరువులు, బావుల వద్దకు ఒంటరిగా వెళ్లకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈత రాని వారు నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడొద్దని కోరారు. ఈతకు కుటుంబ సభ్యులతోనే కలిసి వెళ్లేలా చూడాలని, కుటుంబ సభ్యులు తమ పిల్లలను అప్రమత్తం చేయాలని కోరారు. ఈత నేర్చుకునే వారు ట్యూబ్‌లు, ఆముదం కర్రలను నడుముకు జాగ్రత్తగా కట్టుకుని తక్కువ నీటిలో నేర్చుకోవాలని సూచించారు.

### దరఖాస్తు గడువు పెంపు

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును మార్చి 23వ తేదీ వరకు పొడిగించినట్లు ఎస్సీ గురుకుల ఆర్‌సీఓ హెచ్.అరుణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని.. ఏప్రిల్ 13 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

### ఆలయ అభివృద్ధికి స్థలం పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్

కనగల్ : దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ పునఃనిర్మాణం కోసం పక్కన ఉన్న దుకాణా సముదాయాలను దేవాదాయ శాఖ డిప్యూటీ కలెక్టర్ ఎం.రమాదేవి శుక్రవారం పరిశీలించారు. ఆలయానికి అనుకుని ఉన్న దుకాణాలను కొనుగోలు చేసి ఆలయ అభివృద్ధికి కేటాయించాలని ఇక్కడి అధికారులు కోరగా.. స్థలం పరిశీలన కోసం దేవాదాయ శాఖ తరఫున ముగ్గురు సభ్యులతో కమిటీ వేసి పరిశీలనకు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి అనుకుని ఉన్న దుకాణాల కొనుగోలుకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఆమె వెంట దేవాదాయ శాఖ తహసీల్దార్ సునీత, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె మహేంద్రకుమార్, కార్యనిర్వాణాధికారి జల్లేపల్లి జయరామయ్య, సీనియర్ అసిస్టెంట్ చంద్రయ్య, ఆలయ ప్రధాన అర్చకులు శ్రవణాచారి, ఎం.మహేష్, జూనియర్ అసిస్టెంట్ లింగస్వామి, ఎస్.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ కట్టడాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని నల్లగొండ రోడ్డు విస్తరణలో భాగంగా రాజీవ్ చౌక్ నుంచి తడకమళ్ల చౌరస్తా వరకు ఉన్న అక్రమ కట్టడాలను శుక్రవారం పోలీసుల సహకారంతో మున్సిపల్ అధికారులు తొలగించారు. కోర్టులో కేసు వేశామని, ఈ విషయంపై సోమవారం మున్సిపల్ అధికారులు విచారణకు రావాల్సి ఉండగా మూడు రోజుల ముందే కూల్చివేయడం అన్యాయమని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ కమిషనర్ సోమయ్య, మున్సిపల్ డీఈ సాయిలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఏఈలు రాంబాబు, జానిమియా మాట్లాడుతూ ముందస్తుగా మున్సిపాలిటీ నుంచి నోటీసులు జారీ చేశామని.. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధల మేరకు రోడ్డు వెడల్పు వంద ఫీట్లు ఉండే విధంగా చర్యలు చేపడుతున్నామని, ఈ క్రమంలో ముందుకు వచ్చిన నిర్మాణాలను తొలగిస్తున్నామని పేర్కొంటున్నారు. ఈ అక్రమ కట్టడాలు కూల్చే సమయంలో వన్ టౌన్, టూ టౌన్ ఎస్‌ఐలు శ్రీనునాయక్, శివతేజ, సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### పాఠశాలల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న నర్సింగరావు

చిట్యాల : చిట్యాలలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, వెంకటాపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను స్టేట్ ఎఫ్ఎల్ఎస్ (ఫౌండేషన్ ఇన్ లిట్రసీ అండ్ న్యూమరీస్) టీం సభ్యుడు సీహెచ్.నర్సింగరావు శుక్రవారం పరిశీలించారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల విద్యా సామర్థ్యాలను, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు.

# మళ్లీ పరీక్షా..?

**ఆందోళనలో నిరుద్యోగులు**
- గ్రూప్ – 1 రద్దుతో మరింత గందరగోళం
- ఉమ్మడి జిల్లా నుంచి ప్రిలిమ్స్‌కు 28,909 దరఖాస్తులు
- అందులో పరీక్షకు హాజరైన వారు 23,588 మంది
- క్వాలిఫై అయిన వారిలోనూ ఉమ్మడి జిల్లా వాసులు ఎక్కువే
- పరీక్ష రద్దుతో ఆవేదన చెందుతున్న ప్రిలిమ్స్ క్వాలిఫైడ్ అభ్యర్థులు


గ్రూప్ 1 పరీక్ష పేపర్ లీక్ చేసిన వారిని శిక్షించాలని కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్న యువతను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

**ఉమ్మడి జిల్లాలో గ్రూపు-1 అభ్యర్థుల వివరాలు**

| | నల్లగొండ | సూర్యాపేట | యాదాద్రి |
|---|---|---|---|
| దరఖాస్తులు | 16,084 | 9,181 | 3,644 |
| ప్రిలిమ్స్‌కు హాజరైనవారు | 13,195 | 7,472 | 2,921 |

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ పరీక్ష పేపర్ల లీకేజీ వేడి జిల్లాలోని నిరుద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, అసిస్టెంట్ ఇంజనీర్ ఇలా ఒక్కో పరీక్ష పేపర్లు లీకయ్యాయంటూ రోజుకో లీక్ వ్యవహారం బయటకు వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు గ్రూపు-1 పేపరు కూడా లీక్ అయిందని, దానిని రద్దు చేస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ శుక్రవారం ప్రకటించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అప్పులు చేసి, హైదరాబాద్‌లో ఉండి నెలల తరబడి కోచింగ్ తీసుకొని పరీక్షలు రాస్తే ఇప్పుడు పేపరు లీకేజీతో పరీక్షే రద్దు కావడంతో తీవ్ర ఆవేదనలో పడ్డారు. ప్రిలిమినరీ పరీక్ష పూర్తయి అందులో అర్హత సాధించి మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్న సమయంలో పరీక్షను రద్దు చేయడంతో ఏం చేయాలో తోచని స్థితిలో ఉన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు 2011లో గ్రూపు-1 నిర్వహించగా పొరపాట్లతో కూడిన అనేక అవాంతరాలు, కోర్టు వివాదాల తరువాత 2017 వాటి ఫలితాలను ఇచ్చి నియామకాలు చేపట్టిన విషయం తెలిసిందే.

**తెలంగాణ వచ్చాక తొలిసారి గ్రూప్-1 నోటిఫికేషన్..**

2014లో తెలంగాణ వచ్చాక కూడా గ్రూపు-1 నోటిఫికేషన్ రాలేదు. 11 ఏళ్ల తర్వాత 503 పోస్టులతో 2022లో గ్రూపు-1 నోటిఫికేషన్ వచ్చింది. దీనికోసం ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 28,909 అభ్యర్థులు దరఖాస్తు చేసుకొని పరీక్షలకు సిద్ధం అయ్యారు. అందులో 23,588 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇక, రాష్ట్ర వ్యాప్తంగా 1:50 రేషియోతో మెయిన్స్‌కు 25,050 మందితో టీఎస్‌పీఎస్సీ అర్హుల జాబితాను ప్రకటించింది. ఇందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారు ఎక్కువ మంది ఉన్నారు. ఇప్పుడు ఆ పరీక్ష రద్దు కావడంతో వారంతా తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ పరీక్ష కోసం కష్టపడి చదివిన తాము మళ్లీ నిర్వహించే పరీక్షలో అర్హత సాధిస్తామా.. లేదా.. అనే ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ అర్హత సాధించకపోతే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు పేపర్ లీకేజీ వ్యవహారంపై జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. శుక్రవారం ఏబీవీపీ కార్యకర్తలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. కొందరు విద్యార్థులు కలెక్టరేట్ లోపలికి చొచ్చుకొని పోయేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు.

**అప్పు చేసి కోచింగ్ తీసుకున్నా**


గ్రూపు-1 రద్దుతో ఇప్పుడేం చేయాలో అర్థం కావడం లేదు. ఇప్పటికే వేల రూపాయలు అప్పులు చేసి ఆరు నెలలపాటు కోచింగ్ తీసుకున్నా. మెయిన్స్‌కు సిద్ధమవుతున్నా. ఇప్పుడు మళ్లీ ప్రిపరేషన్ ఎలాగో అర్థం కావడం లేదు.
– పి.సతీష్, రావిపహాడ్

**మళ్లీ పరీక్షలో అర్హత సాధిస్తానా..**


గ్రూప్-1 పేపర్ లీకేజీతో నిరుపేద కుటుంబాల అభ్యర్థులకు ఎంతో నష్టం. కష్టపడి చదివి క్వాలిఫై అయ్యాం. మళ్లీ పరీక్ష రాయాలంటే ఆందోళనగా ఉంది. మానసిక స్థైర్యాన్ని కోల్పోయే పరిస్థితి వచ్చింది.
– కె.స్నేహలత, సూర్యాపేట

**ఆర్థికంగా నష్టపోయాం**


ప్రైవేట్ టీచర్ ఉద్యోగం మానేసి ఏడాదిన్నరగా నల్లగొండలో అద్దె ఇంట్లో ఉంటూ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్నా. మెయిన్స్ కోసం సీరియస్‌గా చదువుకుంటున్నా. ఈ పరిస్థితుల్లో పరీక్ష రద్దయింది. మళ్లీ ప్రిపేర్ కావాలంటే ఎలా? ఇప్పటికే సంపాదన లేదు.
– డి.స్వామి, చండూరు

**పిల్లలను పట్టించుకోకుండా చదివా**


ఆరు నెలల వయసున్న బాబుకు దూరంగా ఉంటూ ఏడాది కాలంగా ప్రిపేర్ అవుతున్నా. ఇప్పుడు పరీక్ష రద్దుతో ఇంకెన్నాళ్లు పిల్లలకు, కుటుంబానికి దూరంగా ఉండి చదువుకోవాలో అర్థం కావడం లేదు.
– రమావత్ అంజలి, హాలియా

**టీఎస్‌పీఎస్సీపై నమ్మకం పోతోంది**


టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులే పేపర్లు లీక్ చేస్తే నమ్మకం ఎలా ఉంటుంది. మా తల్లిదండ్రులు కూలి పనిచేస్తూ నన్ను చదివించారు. వేల రూపాయలు పెట్టి కోచింగ్ ఇప్పించారు. ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయ్యాను. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు.
– రావుల తులసి, చిట్యాల

**సమయం వృథా**


పరీక్ష రద్దుతో కష్టపడి చదివిన సమయమంతా వృథా అయ్యింది. ఈ నిర్ణయం వల్ల అనేక మంది తీవ్రంగా నష్టపోయాం. సర్వీస్ కమిషన్ లోపం వల్లే ఇదంతా జరిగింది. లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
– గంజి వేణు, శాబ్దుల్లాపురం

# అర్హులకు ‘డబుల్’ ఇళ్లు ఇవ్వాలి


సామగ్రితో డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం వద్దకు చేరుకున్న దరఖాస్తుదారులు

- దేవరకొండలో డబుల్ బెడ్‌రూంలలోకి చేరిన పలువురు దరఖాస్తుదారులు
- విచారణలో అర్హులని తేలిన వారికి న్యాయం చేయాలని డిమాండ్
- సామగ్రితో వచ్చి ఆందోళన

దేవరకొండ : ఇళ్లు లేని అర్హులైన తమకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలంటూ దరఖాస్తుదారులు చేపట్టిన ఆందోళనకు తెరపడడం లేదు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్దనే ఆందోళన చేపడుతూ వంటావార్పుతో తమ నిరసన తెలుపుతున్నారు. ఆర్డీఓ, డీఎస్పీ స్థాయి అధికారులు నచ్చజెబుతున్నా వారు మాత్రం పట్టువీడడడం లేదు.. రీసర్వే నిర్వహించి తమకు ఇళ్లను కేటాయించాల్సిందేనని భీష్మించారు. ఈ క్రమంలోనే తాజాగా శుక్రవారం 6, 14, 12 వార్డులకు చెందిన దాదాపు 40 మంది దరఖాస్తుదారులు తట్టాబుట్టా సర్దుకొని కుటుంసభ్యులతో కలిసి డబుల్ బెడ్రూం ఇళ్లలోకి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల డ్రా పద్ధతిన ఎంపిక చేసిన డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల జాబితాలో అనర్హులను చేర్చారని వారు ఆరోపించారు. కనీసం గూడు లేని తమకు అధికారులు డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. ఇదిలా ఉంటే రెండు రోజుల క్రితం సంబంధిత అధికారులు తమ కాలనీలో దరఖాస్తులపై విచారణ చేపట్టారని, అర్హులని తేలిన తమకు ఇళ్లను మంజూరు చేయాలన్నారు. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు ఎంత నచ్చజెప్పినా వారు మాత్రం ససేమిరా అంటూ భీష్మించారు. దీంతో పోలీసులు డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద బందోబస్తు చేపట్టారు.

# వైరస్‌లపై అప్రమత్తం

- కోవిడ్, హెచ్3 ఎన్2 వేరియంట్ కేసులు నమోదుపై వైద్యారోగ్య శాఖ ముందస్తు చర్యలు
- ఆస్పత్రుల్లో పరీక్షల సంఖ్య పెంచాలని ఆదేశాలు




నల్లగొండ టౌన్ : కరోనా, హెచ్3, ఎన్2 వేరియంట్ కేసులు నమోదు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖను అప్రమత్తం చేసింది. కేసులను అరికట్టడానికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖను ఆదేశించింది. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రితో పాటుగా అన్ని ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో కరోనా పరీక్షల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి కరోనా, హెచ్3, ఎన్2 వేరియంట్ కేసులు నమోదు లేనప్పటికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. మూడు కోవిడ్ వేరియంట్‌లను ఎదుర్కొన్న అనుభవంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న హెచ్3, ఎన్2 వేరియంట్‌ను సులువుగా నియంత్రించవచ్చని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తోంది.

**విష జ్వరాల బారిన ప్రజలు**

జిల్లాలో వారం పది రోజులుగా విషజ్వరాల బారిన పడి ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. జ్వరం, వంటినొప్పులు, జలుబు, దగ్గు, తలనొప్పి వంటి లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీంతో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచింది. కోవిడ్ టెస్ట్‌లను పెంచాలని, విష జ్వరాలకు సంబంధించిన రక్త పరీక్షలను కూడా నిర్వహించాలని అన్ని పీహెచ్‌లకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు ఆదేశాలను జారీ చేశారు. క్షేత్ర స్థాయి సిబ్బందితో పాటుగా మెడికల్ ఆఫీసర్‌లు అప్రమత్తంగా ఉండాలని.. ఎప్పుడు ఏ కేసు నమోదైనా వాటిని నియంత్రించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఆందోళన అవసరం లేదు**


ప్రస్తుతం జిల్లాలో కరోనా, హెచ్3, ఎన్2 వేరియంట్ కేసుల నమోదు లేదు. అయినా ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం వస్తున్న వేరియంట్ వల్ల ఎలాంటి ప్రమాదం లేదు. వారం రోజుల్లో తగ్గిపోతుంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉంది. ఏ వేరియంట్ వచ్చినా అరికట్టడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కోవిడ్ నిబంధనలను విధిగా పాటించాలి.
– డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్ఓ

# యూనిట్లు 76.. దరఖాస్తులు 495

- మైనార్టీ సబ్సిడీ రుణాల కోసం భారీగా అప్లికేషన్లు
- నేడు నల్లగొండ టౌన్ హాల్‌లో ఇంటర్వ్యూలు




నల్లగొండ టూటౌన్ : స్వయం ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలకు నల్లగొండ పట్టణంలోని మైనార్టీలు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. లక్ష రూపాయల యూనిట్లు 44, రూ.2 లక్షల యూనిట్లు 32 ఉన్నాయి. లక్ష రూపాయల రుణానికి 80 శాతం, రూ.2 లక్షల రుణానికి 70 శాతం సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. దీంతో పట్టణానికి చెందిన 675 మంది మైనార్టీలు దరఖాస్తులు చేసుకున్నారు. ఆన్‌లైన్ పత్రాలను మాత్రం 495 మంది మాత్రమే మున్సిపాలిటీలో అందజేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని మరో 180 మంది మున్సిపాలిటీ కార్యాలయంలో అందజేయకపోవడంతో వారు ఇంటర్వ్యూలకు అర్హత కోల్పోయారు. దరఖాస్తులు చేసుకున్న 485 మందికి శనివారం పట్టణంలోని టౌన్ హాల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

**లబ్ధిదారుల ఎంపిక కత్తి మీద సామే..**

495 మందిని ఇంటర్వ్యూలు చేసి 76 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ ప్రకియ అధికారులకు కత్తి మీద సాముగా మారింది. మైనార్టీ కార్పొరేషన్, బ్యాంకుల అధికారులు, మున్సిపల్ అధికారులు కలిసి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఇప్పటికే అధికారులపై ఒత్తిళ్లు పెరిగినట్లు తెలిసింది. అర్హులకు ఇస్తారో.. డబుల్ బెడ్ రూం ఇళ్ల మాదిరిగా అనర్హులకు ఇస్తారో వేచి చూడాల్సిందే.

**దళారుల పైరవీలు..**

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు ఇప్పిస్తామని కొందరు దళారులు పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది. దళారులు రుణం ఇప్పిస్తామని చెబుతున్నా.. రుణం వచ్చిన తరువాతే పర్సెంటేజీ ఇస్తామని దరఖాస్తు చేసుకున్న వారు చెబుతున్నట్లు తెలిసింది. మాత్రం మూడు శాఖల అధికారులు ఇంటర్వ్యూలు చేయనున్నందున దళారులను నమ్మి నష్టపోవద్దని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, ఎలాంటి పైరవీలకు తావులేదని స్పష్టం చేస్తున్నారు.

# పోస్టాఫీసు ద్వారా భద్రాచలం తలంబ్రాలు

రామగిరి(నల్లగొండ) : శ్రీ రామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరిగే కల్యాణ తలంబ్రాలు తపాలా శాఖ ద్వారా భక్తులకు అందించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ రఘునాథస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు స్పీడ్ పోస్ట్ ద్వారా తలంబ్రాలు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయానికి వెళ్లలేని భక్తులు దగ్గరలోని పోస్టాఫీసుకి వెళ్లి మార్చి 28వ తేదీలోగా అర్చణ కల్యాణ తలంబ్రాలకు రూ.450, ముత్యాల తలంబ్రాలకు రూ.150 చెల్లించి బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

# అధికారులు అలసత్వం వీడాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పక్కన అదనపు కలెక్టర్


సమావేశానికి హాజరైన ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు తదితరులు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- ఉపాధి హామీ పనులపై మండల స్థాయి అధికారులతో సమీక్ష

నల్లగొండ : మండల స్థాయి అధికారులు అలసత్వం వీడి బాధ్యతతో పని చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం నల్లగొండలోని టీటీడీసీలో ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీడీలు, డీఎల్‌పీఓలు, ఏపీఓలతో ఉపాధి హామీ పథకం, పంచాయతీ ట్యాంకర్ల వినియోగం, నర్సరీలు, మొక్కల నిర్వహణ తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఉపాధి హామీ పథకం ప్రగతిలో రాష్ట్రంలో జిల్లాను ముందు స్థానంలో నిలిచేలా పని చేయాలని అన్నారు. నల్లగొండ పెద్ద జిల్లా అయినందున గ్రామీణ ప్రాంతం ఎక్కువగా ఉంటుందని.. ఎక్కువ మంది కూలీలు పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. తక్కువ కూలీలు వస్తున్న గ్రామాలపై ఎక్కువ దృష్టి సారించాలని, మండలస్థాయి అధికారులతో వారంలో రెండు సార్లు సమీక్షించాలని జెడ్పీ సీఈఓకు సూచించారు. జిల్లాస్థాయి నుంచి తనతో పాటు అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు కూడా క్షేత్ర స్థాయిలోని పర్యటించి పనులు సమీక్షిస్తామని తెలిపారు. జూన్‌లో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకం, నిర్వహణపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అకాల వాన.. రైతుల ఆందోళన

- జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం
- 10.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు
- 1,060 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారుల అంచనా


వడగళ్ల వానతో నాంపల్లి మండల కేంద్రం శివారులో దెబ్బతిన్న వరి చేను

నల్లగొండ అగ్రికల్చర్ : ఉపరితల ద్రోణి కారణంగా కురిసిన వర్షం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈదురుగాలులుతో కూడిన వర్షంతో పాటు అక్కడక్కడ వడగండ్లు కూడా పడడంతో పంటలకు నష్టం వాటిల్లింది. గురువారం ఉదయంనుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలో 10.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మర్రిగూడ, నాంపల్లి, గుర్రంపోడు మండలాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా కనిపించింది. 33 శాతానికి పైగా నష్టపోయిన పంటల వివరాలను జిల్లా వ్యవసాయశాఖ సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. మొత్తం 1,060 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు అంచనా వేశారు.

**నాన్ ఆయకట్టులో ఎక్కువ నష్టం..**

నాన్ ఆయకట్టు ప్రాంత మండలాలైన గుర్రంపోడు, నాంపల్లి, మర్రిగూడలో ముందస్తుగా వరిసాగు చేయడంతో చేలు మరో వారం పదిరోజులలో కోతకు రానున్నాయి. ఈదురుగాలులు, వడగండ్లతో వర్షం కురవడంతో ధాన్యం నేలరాలి రైతులు నష్టపోయారు. మామిడి, బత్తాయి, పుచ్చ వంటి తోటల్లో కాయలు రాలి పగిలిపోయినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మిర్చిచేలు కూడా పిందెలు రాలిపోయినట్లు ప్రాథమిక అంచనాలు వేశారు.

**పొంచి ఉన్న ముప్పు..**

మరో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 4 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా నాన్ ఆయకట్టు ప్రాంతంలో చేలు కోత దశలో ఉన్నాయి. ఈ వర్షంతో చేలు నేలవాలి, గింజలు రాలిపోయి తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి, బత్తాయి, ఇతర తోటలకు కూడా గాలులతో కూడిన వర్షం కు రిస్తే నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

**పంట నష్టం ఇలా (ఎకరాల్లో)**

| వరి | మిర్చి | పండ్లతోటలు |
|---|---|---|
| 385 | 90 | 270 |

| ఇతర పంటలు | పంట నష్టపోయిన రైతులు |
|---|---|
| 315 | 136 మంది |

**పరిహారం అందించాలి**


అకాల వర్షం, వడగండ్లు రావడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రెండు ఎకరాల్లో టమాట పంట అంతా నేల పాలైంది. ప్రభుత్వం సర్వే చేసి పరిహారం అందిస్తే కనీసం పెట్టుబడి అయిన దక్కే అవకాశం ఉంటుంది.
– దోనల శేఖర్, రైతు, నాంపల్లి

| వర్షపాతం ఇలా.. | | | | | |
|---|---|---|---|---|---|
| మండలం | మి.మీ. | నల్లగొండ | 3.3 | తిరుమలగిరి | 31.0 |
| | | మునుగోడు | 11.3 | పెద్దవూర | 6.9 |
| కనగల్ | 44.09 | చండూర్ | 9.6 | చింతపల్లి | 10.8 |
| మర్రిగూడ | 33.3 | అనుముల | 10.8 | నాంపల్లి | 19.1 |
| చిట్యాల | 12.4 | నిడమనూరు | 4.2 | గుర్రంపోడు | 4.8 |
| నార్కట్‌పల్లి | 2.9 | త్రిపురారం | 3.9 | పీఏపల్లి | 9.8 |
| కట్టంగూర్ | 4.7 | మాడ్గులపల్లి | 5.5 | నేరడుగొమ్ము | 3.0 |
| శాలిగౌరారం | 5.3 | వేములపల్లి | 7.1 | కొండమల్లేపల్లి | 13.3 |
| నకిరేకల్ | 2.6 | మిర్యాలగూడ | 5.6 | దేవరకొండ | 8.5 |
| కేతేపల్లి | 0.8 | దామరచర్ల | 3.1 | గుండ్లపల్లి | 2.7 |
| తిప్పర్తి | 13.9 | అడవిదేవులపల్లి | 13.0 | చందంపేట | 6.3 |

## క్లుప్తంగా

### పిడుగుపాటుకు ఐదు మూగజీవాలు మృతి



మృతిచెందిన గొర్రెలు

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని రామన్న గూడెంలో శుక్రవారం తెల్లవారుజామున పిడుగుపాటుకు గురై నాలుగు గొర్రెలు, ఒక మేక మృతి చెందాయి. ఉప్పుల రాజమల్లు గొర్రెలను తెల్లవారుజామున ఊరి చివరకు తోలుకపోతుండగా ఒక్కసారిగా పిడుగుపడింది. ఈ క్రమంలో మందలోని రాజమల్లుకు చెందిన నాలుగు గొర్రెలు. పన్నాల శంభారెడ్డికి చెందిన మేక అక్కడికక్కడే మృతి చెందాయి. రాజమల్లు మందకు దూరంగా ఉండడంతో ఇతనికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. మృతిచెందిన గొర్రెల విలువ దాదాపు రూ.80 వేలు ఉంటుందని, వాటి మీదనే ఆధారపడి బతుకుతున్న తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

### కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలో శుక్రవారం ప్రమాదవశాత్తు కారు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపురం గ్రామానికి చెందిన ఎస్‌డీ మస్తాన్ వలీ, ముబీన్‌లు కలిసి మఠంపల్లికి కారులో బయలుదేశారు. గ్రామ శివారులోకి రాగానే కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో కారులో ఉన్న వారు కిందకు దిగారు. ఇంతలో కారు మొత్తం మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు గమనించి నీళ్లు చల్లినా మంటలు చల్లారలేదు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

# భయాందోళనలో గురుకులం విద్యార్థులు

- నీళ్ల ట్యాంకు గోడ కూలిన ఘటన నుంచి తేరుకోని చిన్నారులు
- ఇళ్లకు వెళ్లిన సగం మంది విద్యార్థులు
- పాఠశాలను సందర్శించిన అధికారులు



మృతిచెందిన విద్యార్థి రావుట్ల పవన్ (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట) : చివ్వెంల మండల కేంద్రంలోని నాగారం బీసీ బాలుర గురుకుల పాఠశాలలో నీటి ట్యాంకు గోడ కూలి 5వ తరగతి విద్యార్థి రావుట్ల పవన్ మృతి చెందడంతో పాఠశాలలో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి పిల్లలను తీసుకువెళ్లారు. దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పాఠశాలలోనే ఉన్నారు. ప్రస్తుతం ఉన్న బిల్డింగ్ శిథిలావస్థకు చేరినట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. ఈ భవనం పక్కనే వ్యవసాయ పొలాలు ఉండటంతో ఎలుకలు వచ్చి నిద్రిస్తున్న విద్యార్థులను గాయపరుస్తున్నాయని చెప్పారు. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికితీసుకువచ్చినా భవనాన్ని మార్చలేదని విద్యార్థులు తల్లిదండ్రులు అంటున్నారు. సుమారు 700 మంది విద్యార్థులు ఉంటున్న పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిపడాలేకపోవడంతో ఆరుబయటకు వెళ్తున్నారు. ఇలాంటి క్రమంలో విద్యార్థులు విషపురుగుల బారినపడే పరిస్థితి ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం ప్రైవేట్‌ది కావడంతో యాజమాన్యం నాసిరకంగా వాటర్ ట్యాంకులు నిర్మించి, వదిలివేస్తున్నారని దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం కూలిన వాటర్ ట్యాంకు.. మూడు నెలల క్రితం నిర్మించందేనని, నాసిరకంగా నిర్మించడం వల్లే కూలిపోయిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పాఠశాలను సందర్శించిన అధికారులు**



పాఠశాల ముందు ధర్నా చేస్తున్న నాయకులు

సంఘటన జరిగిన పాఠశాలను సూర్యాపేట ఆర్డీఓ రాజేంద్రకుమార్, గురుకుల పాఠశాలల ఆర్‌సీఓ షహీనా, డీసీఓ అన్నపూర్ణ, తహసీల్దార్ రంగారావులు సందర్శించి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సంఘటన జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. భవనం నాణ్యతపై గతంలో యజమాన్యాన్ని హెచ్చరించామని, ప్రమాద ఘటనపై విచారణ నివేదిక జిల్లా కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు.

**విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా...**

గోడ కూలి మృతిచెందిన రావుట్ల పవన్ కుటుంబాన్ని, గాయపడిన పడిన యశ్వంత్, సుశాంత్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, మృతుని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రుల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం అందించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. మృతుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ. ఏఐఎస్‌ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



కూలిన నీళ్ల ట్యాంకు గోడ

### విషమంగానే యశ్వంత్ ఆరోగ్య పరిస్థితి



నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొప్పుల యశ్వంత్

శాలిగౌరారం: చివ్వెంల మండలంలోని ప్రభుత్వ బీసీ గురుకుల పాఠశాలలో గురువారం నీటి ట్యాంకు గోడ కూలిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శాలిలింగోటంకు చెందిన కొప్పుల యశ్వంత్(10) ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. యశ్వంత్‌ను మొదట సూర్యాపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా.. మెరుగైన వైద్యం కోసం తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు గురువారం రాత్రే తరలించారు. శుక్రవారం సాయంత్రం వరకు ఆ విద్యార్థి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా మారడంతో యశ్వంత్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

### మేకలు చోరీ

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఐదు మేకలు చోరీ చేశారు. గ్రామానికి చెందిన పెంపకందారుడైన కొయ్యలగూడెం కొండయ్యకు సుమారు 20వరకు మేకలు ఉన్నాయి. స్థానిక ఎస్సీ కాలనీ వాటర్‌ప్లాంట్ సమీపంలోని మేకల దొడ్డి వద్ద ఉన్న ఈ మేకల మంద నుంచి ఐదు మేకలను గుర్తుతెలియని వ్యక్తులు కారులో వేసుకుని వెళ్తున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న గ్రామానికి చెందిన వ్యక్తి అనుమానంతో కారును ఆపేందుకు ప్రయత్నించగా.. దొంగలు కారును మరింత వేగం వెళ్లారు. అప్పటికే దొడ్డి వద్దే మరోవ్యక్తి రన్నింగ్‌లోనే కారు ఎక్కి తప్పించుకున్నాడు. ముగ్గురి నుంచి నలుగురు వ్యక్తులు చోరీకి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. రూ.లక్ష వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. కొండయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నల్లగొండ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- పోలీసులు, ఏబీవీపీ నాయకుల మధ్య తోపులాట
- యువతి చేయి పట్టుకున్న పోలీసు అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు

నల్లగొండ టూటౌన్ : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. ఏబీవీపీ నాయకులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. ఏబీవీపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, లీకేజీకి పాల్పడిన దుండగులను శిక్షించడంతో విఫలమైందని ఆరోపించారు. ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి డీసీఎం వ్యాన్‌లోకి ఎక్కించారు. పోలీసులను తప్పించుకొని కలెక్టరేట్ గేటు వద్ద ఆందోళనకు దిగేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఒక్కొక్కరిని అరెస్టు చేసి డీసీఎంలో ఎక్కించి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ తరలించారు.

**పోలీసు అధికారి తీరు వివాదస్పదం..**

కలెక్టరేట్ ముట్టడి సమయంలో పోలీసు అధికారి వ్యవహరించిన తీరు వివాదస్పదంగా మారింది. ఏబీవీపీ నాయకురాలు కలెక్టరేట్ కార్యాలయం ప్రధాన గేటు ముందు బైఠాయించడంతో పోలీసులు ఆమెను బలవంతంగా అరెస్టు చేశారు. మహిళా పోలీసులు ఉన్నా సీఐ రాఘవరావు యువతి చేయి పట్టుకుని డీసీఎం వరకు లాకొచ్చి ఎక్కించాడు. దాంతో సదరు సీఐ తీరుపై పలువురు ఏబీవీపీ నాయకులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఘటనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఐ.. యువతి చేయి పట్టుకున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.



ఏబీవీపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు



యువతిని లాక్కెళ్తున్న పోలీస్ అధికారి, మహిళా పోలీసులు

# గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం



మహిళ మృతదేహం

నల్లగొండ క్రైం: ఏఎంఆర్‌పీ మెయిన్ కెనాల్ కాల్వ నీటిలో శుక్రవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. నల్లగొండ పట్టణ శివారులోని ఆర్జాలబావి బ్రిడ్జి- గరకబావిగూడెం సమీపంలో కాల్వ నీటిలో మహిళ మృతదేహం కంపచెట్టుకు తట్టి ఉండటంతో స్థానికులు గమనించి నల్లగొండ రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బైటకు తీశారు. కాగా.. మహిళ మెడపై కమిలినట్లు ఉంది. గురువారం రాత్రి మహిళ మృత దేహాన్ని నీటిలో పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అయితే ఆమె ప్రమాదవశాత్తు నీటిలో పడిందా.. లేక ఎవరైనా హత్య చేసి నీటిలో పడేశారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతదేహంపై ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఆమె అవివాహితురాలుగా పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి, అక్కడే మార్చురీలో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు 94407 95658, 87126 70177కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.



### అత్యాచారం కేసులో వ్యక్తికి 20 ఏళ్లు జైలు

చివ్వెంల(సూర్యాపేట) : మైనర్‌పై అత్యాచార ఘటనలో వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ప్రేమలత శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం.. చివ్వెంల మండలంలోని కుడకుడ గ్రామానికి చెందిన బాలికపై, అదే గ్రామానికి చెందిన సట్టు రాజు 2020 అక్టోబర్ 7న ఇంట్లో ఎవరూ లేని సమయంలో నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. బయటకు వెళ్లి వచ్చిన తల్లిదండ్రులు కూతురు అపస్మారక స్థితిలో ఉండి, తీవ్ర రక్తస్రావానికి గురి కావడంతో వెంటనే సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి డీఎస్పీ మోహన్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ లోకేష్ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ త్యాగరాజు వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడు సట్టు రాజుకు 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు, రూ.2వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం బాలికకు రూ.5లక్షలు పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, సీఐ సోమ్‌నారాయణ్ సింగ్, ఎస్‌ఐ విష్ణుమూర్తి, పీపీ త్యాగరాజు, భరోసా సెంటర్ సిబ్బందికి ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

**ప్రేమపేరుతో మోసం చేసిన యువకుడికి..**

తుర్కపల్లి: ప్రేమపేరుతో బాలికను గర్భవతిని చేసిన యువకుడికి పోక్సో భువనగిరి కోర్టు 20 సంవత్సరాలు జైలుతో పాటు రూ.2వేల జరిమానా విధించింది. తుర్కపల్లి మండలం పెద్దతండా గ్రామపంచాయతీ పరిధిలోని బాబ్లానాయక్ తండాకు చెందిన మాడోత్ శ్రీకాంత్ అనే విద్యార్థి, 2017లో మైనర్‌ను ప్రేమ పేరుతో మోసం చేసి, గర్భవతిని చేశాడు. ఏడు నెలల తరువాత బాలిక కడుపు నొప్పి వస్తుందని తల్లిదండ్రులకు చెప్పడంతో ఆస్పత్రిలో చూపించగా.. ప్రెగ్నెంట్ అని తేలింది. దీంతో వారు తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆరేళ్లుగా నడుస్తున్న కేసుపై భువనగిరి కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. శ్రీకాంత్‌కు 20 ఏళ్ల జైలుతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ జడ్జి మారుతి దేవి తీర్పునిచ్చారు.

### ఆటో, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

వలిగొండ : మండలంలోని ముద్దాపురం స్టేజి సమీపంలో శుక్రవారం ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. ముద్దాపురం స్టేజి సమీపంలో ఆత్మకూర్(ఎం) మండలంలోని పల్లెర్ల చెందిన వస్తువుల శివ, మోత్కూర్ మండలంలోని పాలడుగుకు చెందిన కొంపెల్లి ప్రకాష్ ఇద్దరు కలిసి బైక్‌పై పల్లెర్ల నుంచి పాలడుగుకు వెళ్తున్నారు. ఈక్రమంలో నరసాపురం నుంచి వలిగొండ వైపు ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న శివ, ప్రకాష్‌ల కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో భువనగిరికి తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చిట్యాల ఎస్‌ఐ ధర్మా శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కృష్ణ జిల్లా గుడివాడ మండలం బోతవోలు గ్రామానికి చెందిన పాతూరి జగదీశ్‌బాబు(41) గురువారం హైదరాబాద్‌కు స్కూటర్‌పై బయలుదేరాడు. వెలిమినేడు గ్రామ శివారులోకి రాగానే హైవేపై అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టాడు. గాయపడిన జగదీశ్‌బాబును చౌటుప్పల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భార్య హైమావతి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### సాగర్ ఎడమ కాల్వలో మహిళ మృతదేహం గుర్తింపు



విశ్వశ్రీ నైపుణ్య (ఫైల్)

హాలియా : హాలియాలోని సాగర్ ఎడమ కాల్వ వద్ద శుక్రవారం మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలు దేవరకొండకు చెందిన విశ్వశ్రీ నైపుణ్య (23)గా గుర్తించారు. ఘటన స్థలానికి హాలియా సీఐ గాంధీ నాయక్ చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. బంధువుల వివరాల ప్రకారం.. దేవరకొండకు చెందిన విశ్వశ్రీ నైపుణ్యకు నిడమనూరు మండల కేంద్రానికి చెందిన నోముల మురళితో ఏడాదిన్న క్రితం వివాహం జరిగింది. ఈ నెల 14న తన స్వగ్రామైన దేవరకొండకు వెళ్లి వస్తానని భర్తకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. నైపుణ్య ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు అదే రోజు దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నైపుణ్య ఆచూకీ కోసం మూడు రోజులుగా కుటుంబ సభ్యులు వెతుకుతుండగా ఈనెల 14న హాలియా వద్ద ఎడమ కాల్వలోకి దూకి ఆత్మహత్యకు చేసుకున్నట్లు హాలియా పోలీస్‌స్టేషన్‌లో సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. దీంతో హాలియా సీఐ గాంధీనాయక్ నేతృత్వంలో ఎడమ కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా స్థానికంగా ఉన్న ఎడమ కాల్వ బ్రిడ్జి వద్ద నైపుణ్య మృతదేహాన్ని గుర్తించారు. స్థానిక యువకుడు శివ సాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. కుటుంబ కలహాల కారణంగానే ఆమె ఎడమ కాల్వలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిందని బంధువులు తెలిపారు. కాగా మహిళ మృతిపై హాలియా పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ గాంధీనాయక్ తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గణేష్ నగర్‌లో నివాసం ఉంటున్న పబ్బాల భాస్కర్ (25) నాలుగు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే ఇటీవల భాస్కర్‌కు ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. దీంతో అతడు గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై చంద్రశేఖర్ పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.



# అకాల వర్ష బీభత్సం

- నేలకొరిగిన వరి పైరు
- మామిడి, నిమ్మ, బత్తాయి తోటలకు తీవ్ర నష్టం
- పరిహారం అందించాలని కోరుతున్న రైతులు

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి, అజ్జిలాపురం, వెంకెపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి కురుసిన వడగండ్ల వానకు వరిపొలాలు, మామిడి, నిమ్మ, బత్తాయి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అకాల వర్షంతో తాము తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం**

మండలంలోని ఆయా గ్రామాల్లో పంట నష్టం వాటిల్లిన వరిపొలాలు, కూరగాయల తోటలను పరిశీలించామని ఏఓ ఆవుల స్పందన, హార్టికల్చర్ అధికారిణి శ్వేత తెలిపారు. మండల వ్యాప్తంగా 173 ఎకరాల్లో వరి, 85 ఎకరాల్లో పండ్ల తోటలు, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు.



మర్రిగూడ: అజ్జిలాపురంలో వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ స్పందన

### నేలవాలిన వరి



నేలకొరిగిన పంట పొలం

గరిడేపల్లి : గరిడేపల్లి మండల వ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుఝామున కురిసిన వర్షంతో పొట్టకు వచ్చిన వరి పైరు నేలకొరిగింది. కురిసిన వడగళ్ల వర్షానికి వరిపొలం నేలమట్టం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### గుర్రంపోడులో 130 ఎకరాల్లో పంట నష్టం



ఘాశీరాంతండాలో నేలకొరిగిన మిరప పంట

గుర్రంపోడు: మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వడగళ్ల వానకు 100 ఎకరాల్లో వరి, 30 ఎకరాల్లో మిర్చి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారి మాధవరెడ్డి తెలిపారు. జూనూతుల, మక్కపల్లి, వీటీనగర్, ఘాశీరాంతండా పరిసర గ్రామాల్లో పంట నష్టం జరిగింది. వెంకటేశ్వర్‌నగర్ గ్రామంలో ఊట్కూరి దామోదర్‌రెడ్డి అనే రైతుకు చెందిన ఎకరం మునగ తోట గాలి వానకు ధ్వంసమైంది.



నాంపల్లి : కేతపల్లిలో మిరప పంటను చూపుతున్న రైతులు

### నాంపల్లిలో వడగళ్లు

నాంపల్లి: కురిసిన అకాల వర్షానికి నాంపల్లి మండల వ్యాప్తంగా 108 ఎకరాల్లో వరి, 4 ఎకరాల్లో వేరుశనగ, 180 ఎకరాల్లో పుచ్చకాయ, 100 ఎకరాల్లో బత్తాయి, 10 ఎకరాల్లో నిమ్మ, 1 ఎకరంలో మునగ, 19 ఎకరాల్లో జొన్న, 3 ఎకరాల్లో బొబ్బరి, ఎకరంలో సజ్జ, 25 ఎకరాల్లో బొప్పాయి, 55 ఎకరాల్లో ఎర్ర మిర్చి, 60 ఎకరాల్లో మామిడితో పాటు 50 ఎకరాల్లోని పలు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. తహసీల్దార్, ఏఓ, హార్టికల్చర్ అధికారులు నాంపల్లి, కేతేపల్లి, గట్ల మల్లేపల్లి, మహ్మదాపురం, పెద్దాపురం గ్రామాలను సందర్శించి పంట నష్టపోయిన రైతులతో మాట్లాడారు. పరిహారం వచ్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

నాంపల్లిలో వడగళ్ల వానకు రాలిన సపోట కాయలు



### చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో 6 నెలల జైలు

హుజూర్‌నగర్ : చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి సంకేత్ మిత్ర శుక్రవారం తీర్పునిచ్చారు. ఫిర్యాదుదారు తరుపు న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన భీమిశెట్టి పద్మ వద్ద ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన భూక్యా పంతులు 2012లో రూ.3 లక్షలను నెలకు రూ.2ల వడ్డీ కింద అప్పుగా తీసుకున్నాడు. తన బాకీ చెల్లించాలని పద్మ అనేక సార్లు కోరినా అతను చెల్లించలేదు. చివరకు 2014 ఆగస్టు 5న ఆమెకు రూ.3 లక్షల చెక్కు ఇచ్చాడు. సదరు చెక్కును బ్యాంక్‌లో జమ చేయగా భూక్యా పంతులు అకౌంట్లో సరిపడా నిధులు లేవని బ్యాంక్ అధికారులు చెక్కును వాపస్ చేశారు. దీంతో బాధితురాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. సాక్షులను విచారించిన అనంతరం నేరం నిరూపణ కావడంతో పంతులుకు 6 నెలల సాధారణ జైలు శిక్ష, పరిహారం కింద ఫిర్యాదుదారుకు రూ.లక్షను 3 నెలల్లోగా చెల్లించాలని జూనియర్ సివిల్ జడ్జి సంకేత్ మిత్ర తీర్పు చెప్పారు. నిర్ణీత గడువులో డబ్బులు చెల్లించకపోతే మరో 2 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తెలిపారు. అయితే ముద్దాయి గతంలో జైలు శిక్ష అనుభవించి ఉంటే ఆ జైలు శిక్ష కాలాన్ని మినహాయించాలంటూ తీర్పులో పేర్కొన్నారని న్యాయవాది వివరించారు.

### తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

వలిగొండ : మండలంలోని వెల్వర్తి గ్రామానికి చెందిన పరకాల సత్యనారాయణ రోజుమాదిరిగా కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని వెంటనే భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గీత కార్మికుడిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం సభ్యులు మద్దెల రాజయ్య, గాజుల ఆంజనేయులు, పబ్బతి మల్లేశం, పలుసం స్వామి తదితరులు కోరారు.